RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
# హైదరాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
hyderabadestate.co.in
సంపుటి -4 సంచిక -6 06 ఆదివారం సెప్టెంబర్ 2026 ఎడిటర్ లక్ష్మి నారాయణ




పేజీలు - 6 వెల రూ 5 /--

# ఢిల్లీ పోలీసులపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం



**-విద్యార్థులు, నిరసనకారులపై బలప్రయోగాన్ని తప్పుపట్టిన సుప్రీంకోర్టు**

**-నిరసన తెలిపే హక్కు రాజ్యాంగబద్ధమైనదని వ్యాఖ్య-బాధ్యులైన అధికారుల తీరుపై నివేదిక సమర్పించాలని ఆదేశం**

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు, నిరసనకారులపై ఢిల్లీ పోలీసులు జరిపిన తీవ్ర లాఠీఛార్జ్, బలప్రయోగాన్ని అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. జంతర్ మంతర్ ఘటనా స్థలంలో చోటుచేసుకున్న దారుణ పరిణామాలపై దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు రాజ్యాంగబద్ధమైనదని, ప్రశాంతంగా నిరసన వ్యక్తంచేసే వారిపై పోలీసులు క్రూరంగా వ్యవహరించడం ఎంతో విచారకరం, దిగ్భ్రాంతికరం అని వ్యాఖ్యానించింది. ఈ క్రమంలోనే పోలీసుల దాడి, పెల్లెట్ గుండ్ల ప్రయోగం, మహిళా నిరసనకారులపై జరిగిన దౌర్జన్యాలపై సమగ్ర విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో ఐదుగురు సభ్యుల అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. శాంతియుత వాతావరణంలో విద్యార్థులు తమ సమస్యలపై నిరసన తెలుపుతుంటే పోలీసులు విచక్షణారహితంగా ప్రవర్తించడం ఎంతమాత్రం తగదని, ఈ ఘటనలో బాధ్యులైన అధికారుల తీరుపై నివేదిక సమర్పించాలని కమిటీని ఆదేశించింది. సుప్రీంకోర్టు చేసిన ఈ వ్యాఖ్యలు, కమిటీ ఏర్పాటుతో ఢిల్లీ పోలీసు వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి నెలకొంది.

# రెండేళ్లలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తాం

**-సాంకేతిక విద్యకు ప్రభుత్వ సహకారం ఉంటుందన్న రేవంత్**

**-పాలిటెక్నిక్ విధానంలో మార్పులు లేవని స్పష్టీకరణ**



విద్యాశాఖలో అనేక మార్పులు తీసుకొస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులను పూర్తి చేశామని చెప్పారు. టీచర్ల బదిలీల విషయంలోనూ ప్రభుత్వం ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తోందన్నారు. కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. తల్లిదండ్రులతో సమానంగా పిల్లల భవిష్యత్తుకు పునాది వేసేది ఉపాధ్యాయులేనని రేవంత్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెండేళ్ల సమయం ఇస్తే సమస్యలను పరిష్కరించి చూపిస్తానన్నారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని సీఎం చెప్పారు. సాంకేతిక విద్యకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విద్యావిధానంలో ఎలాంటి మార్పులు చేయడం లేదని స్పష్టం చేశారు. విద్యాశాఖ కమిషన్ ద్వారా అనేక సమస్యలను పరిష్కరిస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పీఆర్సీ సమస్యను పరిష్కరించామని చెప్పారు. ఇటీవల ఇందిరాపార్క్ వద్ద ఉపాధ్యాయులు ధర్నా చేయడం తనకు చాలా బాధ కలిగించిందన్నారు. కార్యక్రమానికి ముందు కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సీఎం పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు.

# సమస్యలు గాలికొదిలేసి దేనికి ఈ సంబరాలు?

**-: రేవంత్ సర్కార్‌పై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం**

కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలన వేడుకలను జరుపుకోవడంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ముఖం పెట్టుకుని సంబరాలు చేసుకుంటోందని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల తీరు 'ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే' అన్న చందంగా తయారైందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాగిస్తున్న పరిపాలనా విధానాన్ని, ఆయన పనితీరును ప్రజలు తీవ్రంగా అసహ్యించుకుంటున్నారని మండిపడ్డారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కుంభకోణాలమయంగా మారిపోయిందని హరీశ్ రావు ఆరోపించారు. హామీలు నెరవేర్చడంలో విఫలమైన రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని తాము డిమాండ్ చేస్తుంటే, బాధ్యతారాహిత్యంగా కేసీఆర్ రాజీనామా చేయాలనడం విడ్డూరంగా ఉందన్నారు. రాజీనామా చేయాల్సింది కేసీఆర్



కాదని, ప్రజలను మోసం చేసిన రేవంత్ రెడ్డేనని తేల్చిచెప్పారు. విద్యార్థులు, నిరుద్యోగుల ఆవేదన, జీఓ 97 రద్దు, రైతాంగానికి నమ్మకమైన ఉచిత విద్యుత్ సరఫరా వంటి కీలక ప్రజా సమస్యలే ఎజెండాగా రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ గళమెత్తుతుందని తెలిపారు. సభలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు అధినేత కేసీఆర్ బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో పూర్తి దిశానిర్దేశం చేస్తారని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# కేసీఆర్‌కు పట్టిన గతే రేవంత్‌కూ పడుతుంది:

**- రాంచందర్ రావు**

**22ఏ నిషేధిత భూముల జాబితాపై రాంచందర్ రావు విమర్శలు**
**ధరణి పేరుతో ప్రజలను పీడించిన కేసీఆర్ ప్రభుత్వం ఓటమిపాలైందని ఆరోపణ**
**రేవంత్ కూడా అదే బాటలో పయనిస్తూ తన గోతిని తానే తవ్వుకుంటున్నారని వ్యాఖ్య**



సామాన్యుల ఆస్తులు, రైతుల పొలాలను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం భూదందా సాగిస్తోందని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు విమర్శించారు. 22ఏ నిషిద్ధ జాబితా పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల సొంత భూములను లాక్కునేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నాయకత్వంలో ఈరోజు జరిగిన మహాధర్నాకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల భూములపై పడ్డ ఏ పాలకుడు చరిత్రలో బాగుపడలేదని హెచ్చరించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం 'ధరణి'తో ప్రజలను పీడించి ఏ విధంగా అధికారానికి దూరమైందో... ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే బాటలో పయనిస్తూ తన గోతిని తానే తవ్వుకుంటున్నారని మండిపడ్డారు. హైడ్రా, క్యూర్, 22ఏ వంటి నిర్ణయాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, 30 శాతం కమీషన్ల కోసం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తులో బీఆర్ఎస్ కంటే దారుణమైన పరాభవం తప్పదని స్పష్టం చేశారు. వెంటనే 22ఏ కింద చేర్చిన బాధితుల భూములపై రివ్యూ జరిపి, ఆ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ రాజీలేని పోరాటం చేస్తుందని తేల్చిచెప్పారు

# కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి:

**- పొన్నం ప్రభాకర్ డిమాండ్ -వెయ్యి రోజులుగా సభకు రాకుండా జీతం తీసుకుంటున్నారని ఆరోపణ**
**-కేసీఆర్ వైఖరికి నిరసనగా 6న ఇందిరా పార్క్ వద్ద కాంగ్రెస్ మహా ధర్నా-ధర్నాలో కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనను వివరిస్తామన్న మంత్రులు**
**-సన్నాహక సమావేశంలో పాల్గొన్న మంత్రులు పొన్నం, శ్రీధర్ బాబు**



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి తక్షణమే రాజీనామా చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధిగా తన బాధ్యతలు నిర్వర్తించని వ్యక్తి ఆ పదవిలో కొనసాగడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయమై ఈ నెల 6న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద 'మహా ధర్నా' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ధర్నాకు సంబంధించిన సన్నాహక సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రానికి వందేళ్ల నష్టం వాటిల్లిందని విమర్శించారు. "వెయ్యి రోజులుగా ఎమ్మెల్యేగా వేతనం తీసుకుంటున్న కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని, కనీసం తన నియోజకవర్గ ప్రజలకు కూడా అందుబాటులో ఉండటం లేదు. ప్రతిపక్ష నేతగా ఆయన పూర్తిగా విఫలమయ్యారు" అని ఆరోపించారు. కేసీఆర్ వైఖరిని ప్రజల దృష్టికి తీసుకెళ్లడానికే ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఇదే వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామని ఆయన తెలిపారు. ఈ మహా ధర్నాను విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

# వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్--2027కు యువతకు ఆహ్వానం

## -దేశ భవిష్యత్ నిర్మాణంలో యువత ఆలోచనలు కీలకం: కిరణ్మయి దేవిరెడ్డి

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి గుంటూరు, సెప్టెంబర్ 05 2026
భారతదేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో యువతలోని ప్రతిభ, ఆలోచనలు, సృజనాత్మకతను వెలికితీసేందుకు కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మేరా యువ భారత్ ద్వారా వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ 2027 నిర్వహిస్తున్నట్లు మేరా యువ భారత్ గుంటూరు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ కిరణ్మయి దేవిరెడ్డి తెలిపారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు గల యువతకు తమ వినూత్న ఆలోచనలు, విధానపరమైన సూచనలను జాతీయ స్థాయి నాయకత్వం ముందు ప్రదర్శించే అవకాశం కల్పిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సదరన్ గేట్‌వే: టెక్నాలజీ ఒ ఇన్నోవేషన్ రీజియన్ పరిధిలోకి వస్తుందని కిరణ్మయి దేవిరెడ్డి తెలిపారు. దీనిలో భాగంగా టెక్నాలజీ, ఇన్నోవేషన్, ఫ్యూచర్ రెడీనెస్ ప్రధాన అంశంగా యువత తమ ఆలోచనలు, పరిష్కారాలను ప్రతిపాదించాల్సి ఉంటుందని తెలిపారు. కృత్రిమ మేధస్సు (ూ×), డిజిటల్ మౌలిక వసతులు, గ్రామీణాభివృద్ధి, స్థిరమైన పారిశ్రామిక అభివృద్ధి, తీర ప్రాంత పరిపాలన వంటి స్థానిక సమస్యలకు సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కారాలను సూచించేందుకు యువతకు అవకాశం ఉంటుందని వివరించారు. అలాగే ఈ పోటీలో ప్రధానంగా వికసిత్ భారత్ ఛాలెంజ్ ట్రాక్, కల్చరల్ ట్రాక్ -- జానపద గీతం/నృత్యం, వక్తృత్వం, చిత్రలేఖనం, కవిత్వం, డిజైన్ ఫర్ భారత్, హ్యాక్ ఫర్ సోషల్ కాజ్, యూత్ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఛాలెంజ్, యూత్ పార్లమెంట్ వంటి ఆరు ప్రధాన విభాగాల్లో యువత తమ ప్రతిభను ప్రదర్శించవచ్చని ఆమె తెలిపారు. ఎంపిక ప్రక్రియలో ముందుగా డిజిటల్ క్విజ్, వ్యాసరచన, జిల్లా స్థాయి పవర్ పాయింట్ ప్రజెంటేషన్, తుదుపరి రాష్ట్ర స్థాయి, అనంతరం న్యూఢిల్లీలో జాతీయ స్థాయి గ్రాండ్ ఫినాలేనిర్వహించనున్నట్లు కిరణ్మయి దేవిరెడ్డి తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి జాతీయ స్థాయిలో న్యూఢిల్లీలో జరిగే కార్యక్రమంలో పాల్గొనే అవకాశం లభిస్తుందని తెలిపారు. జాతీయ స్థాయిలో ఎంపికైన యువతకు డొమైన్ నిపుణులు, కేంద్ర మంత్రులు, ప్రధానమంత్రి తదితరులతో నేరుగా సంభాషించే అవకాశం ఉంటుందని ఆమె వివరించారు. ఈ పోటీలకు సంబంధించిన రిజిస్ట్రేషన్, క్విజ్‌లు, వివిధ దశల




దరఖాస్తులు మరియు సమర్పణలు మై భారత్ డిజిటల్ పోర్టల్ ద్వారా జరుగుతాయని కిరణ్మయి దేవిరెడ్డి తెలిపారు. భారతదేశ భవిష్యత్తును నిర్మించడంలో యువత పాత్ర అత్యంత కీలకం. తమ ఆలోచనలు, సృజనాత్మకత, సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశాభివృద్ధికి అనుసంధానం చేసుకునేందుకు ఈ పోటీలు ఒక గొప్ప వేదిక అని గుంటూరు జిల్లాలోని 15--29 సంవత్సరాల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అధిక సంఖ్యలో పాల్గొనాలి అని కిరణ్మయి దేవిరెడ్డి పిలుపునిచ్చారు.

# ప్రొఫెసర్ కోదండరాం జన్మదిన వేడుకల్లో తెలంగాణ జన సమితి నాయకులు

## -కోదండరాం సారుకు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు




హైదరాబాద్, సెప్టెంబర్ 5: తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు, ప్రొఫెసర్ శ్రీ కోదండరాం సారు జన్మదిన సందర్భంగా తెలంగాణ జన సమితి నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు కోదండరాం సారును కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రొఫెసర్ కోదండరాం కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, ప్రజల పక్షాన నిలబడే నాయకుడిగా కోదండరాం సారు ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు.

కోదండరాం సారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరిన్ని సంవత్సరాలు ప్రజా సేవలో కొనసాగాలని నాయకులు ఆకాంక్షించారు. తెలంగాణ జన సమితిని మరింత బలోపేతం చేస్తూ, ప్రజల సమస్యల పరిష్కారం కోసం పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి జనరల్ సెక్రటరీ పల్లె వినయ్, రంగారెడ్డి జిల్లా జన సమితి అధ్యక్షులు ధారా సత్యం, ఎల్బీనగర్ నియోజకవర్గ జన సమితి ఇన్‌చార్జి కె.వి. రంగారెడ్డి, యూత్ కోఆర్డినేటర్ కొత్త రవి పాల్గొన్నారు. అలాగే జన సమితి నాయకులు దొంతి రెడ్డి, మాణిక్ రెడ్డి, పరమేష్ యాదవ్ తదితరులు పాల్గొని కోదండరాం సారుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ యువతను ప్రజా ఉద్యమాల వైపు తీసుకురావడం, ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయం, తెలంగాణ ప్రజల హక్కుల కోసం నిరంతరం కృషి చేయడం తమ పార్టీ ప్రధాన లక్ష్యాలలో భాగమని తెలిపారు. కోదండరాం నాయకత్వంలో తెలంగాణ జన సమితి ప్రజల సమస్యలపై మరింత బలంగా పోరాటాలు కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

కోదండరాం సారు జన్మదినాన్ని పురస్కరించుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో శుభాకాంక్షలు తెలియజేయడంతో కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. ఆయనకు మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు కలగాలని, ప్రజా సేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని నాయకులు ఆకాంక్షించారు

# డ్రగ్స్‌పై సమరభేరి.. 'సంఘమిత్ర' శ్రీకారం

## - 1.17 లక్షల మంది సభ్యుల ద్వారా ప్రతి కుటుంబానికి అవగాహన

హనుమకొండ, సెప్టెంబర్ 5 హైదరాబాద్ ఎస్టేట్: డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలపై పోరును మరింత విస్తృతం చేస్తూ వరంగల్ జిల్లాలో పోలీస్--ప్రజల భాగస్వామ్యంతో 'సంఘమిత్ర' కార్యక్రమానికి శనివారం శ్రీకారం చుట్టారు. హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళా స్వయం సహాయక సంఘాలు, గ్రామ దీపికలు, మెప్మా సభ్యులు, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లాలోని మహిళా సంఘాల నెట్‌వర్క్‌ను వినియోగించుకుని 1.17 లక్షల మంది సభ్యులకు డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కల్పించడం.. వారి ద్వారా ప్రతి కుటుంబానికి మత్తు పదార్థాల నిర్మూలన సందేశాన్ని చేరవేయడం కార్యక్రమం ప్రధాన లక్ష్యం. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత మాట్లాడుతూ.. డ్రగ్స్ నిర్మూలన కేవలం పోలీసు శాఖ బాధ్యతగా భావించకుండా ప్రతి కుటుంబం, ప్రతి గ్రామం భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ప్రతి మహిళా సంఘ సభ్యురాలు 'సంఘమిత్ర'గా తన పరిధిలోని కుటుంబాలను చైతన్యపరచాలని కోరారు. ముఖ్యంగా తల్లులు తమ పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనిస్తూ వారితో స్నేహపూర్వకంగా మాట్లాడాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి వినియోగం, విక్రయం, సరఫరాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించాలని, సమాచారదాతల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. విలువైన సమాచారం అందించే వారికి తగిన ప్రోత్సాహకం అందిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ డా. సత్యశారద



మాట్లాడుతూ.. డ్రగ్స్ సమస్య పోలీసు శాఖకు మాత్రమే పరిమితమైనది కాదని, సమాజం మొత్తం కలిసికట్టుగా ఎదుర్కోవాల్సిన సవాల్ అని అన్నారు. యువతను సన్మార్గంలో నడిపించడంలో తల్లిదండ్రులు, కుటుంబాలు, విద్యాసంస్థలు, మహిళా సంఘాలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ మాట్లాడుతూ.. 'సంఘమిత్ర'లో భాగస్వాములైన ప్రతి సభ్యురాలు డ్రగ్స్ వ్యతిరేక పోరులో ఒక సైనికురాలిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌కు బానిసై అనంతరం వాటిని వదిలి సాధారణ జీవితంలోకి వచ్చిన వ్యక్తి కార్యక్రమంలో తన అనుభవాలను పంచుకున్నారు. డ్రగ్స్ తనకు కొద్దిసేపు మత్తును ఇచ్చినా, తన కుటుంబానికి ఎన్నో రోజుల కన్నీళ్లను మిగిల్చాయని పేర్కొంటూ.. ఏ యువకుడూ ఆ పరిస్థితికి వెళ్లకూడదని, డ్రగ్స్‌ను ఒక్కసారి కూడా ప్రయత్నించవద్దని విజ్ఞప్తి చేశారు. విద్యార్థినులు డ్రగ్స్ దుష్పరిణామాలపై అవగాహన నాటిక ప్రదర్శించారు. ముఖ్యమంత్రి, డీజీపీ, తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ తదితరుల డ్రగ్స్ వ్యతిరేక సందేశాలతో కూడిన వీడియోలను ప్రదర్శించారు. డ్రగ్స్‌కు బానిసైన వారిని దూరం చేయకుండా కౌన్సెలింగ్,



వైద్య సహాయం, కుటుంబ సహకారం అందించాలని అధికారులు సూచించారు. సరైన సమయంలో సహాయం అందిస్తే వారిని తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావచ్చన్నారు. జనగామ జిల్లాలో తొలిసారిగా నిర్వహించిన 'సంఘమిత్ర' కార్యక్రమాన్ని తాజాగా వరంగల్‌లో ప్రారంభించామని, త్వరలో హనుమకొండ జిల్లాలోనూ విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వై.వి.గణేష్, పీడీ డీఆర్‌డీఓ నాగపద్మజ, జిల్లా వైద్యాధికారి రాజిరెడ్డి, అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్, మామునూరు ఏసీపీ వెంకటేష్, గీసుగొండ ఇన్‌స్పెక్టర్ విశ్వేశ్వర్, మానసిక వైద్య నిపుణుడు డా.భరత్, జిల్లా సమైక్య సంఘం అధ్యక్షురాలు రజిత, టీఎల్‌ఎఫ్ అధ్యక్షురాలు పద్మ, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది, వెయ్యికి పైగా మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. "ప్రతి తల్లి చైతన్యవంతమైతే.. ప్రతి కుటుంబం సురక్షితం. ప్రతి కుటుంబం చైతన్యవంతమైతే.. డ్రగ్స్ రహిత సమాజం సాధ్యమే" అనే నినాదంతో 'సంఘమిత్ర' కార్యక్రమాన్ని వరంగల్‌లో ప్రారంభించారు.

# ఇద్దరు వ్యక్తులు చోరీ అరెస్ట్

హైదరాబాద్ ఎస్టేట్స్ యాదాద్రి జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం అడ్డగూడూర్ మండల కేంద్రంలోని కోటమర్తి గ్రామంలో తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని గ్యాస్ సిలిండర్లు, ఇత్తడి సామాగ్రి, ఇనుప వస్తువులు, చోరీ చేస్తున్న ఇద్దరి వ్యక్తులను అడ్డగూడూర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. అదే గ్రామానికి చెందిన పులిమామిడి వెంకటేష్ (24) వృత్తి కూలీ, బూర్గుల పరశురాములు (32) గ్రామపంచాయతీ సిబ్బంది, వారిని



పోలీసులు అదుపులో తీసుకున్నారు. సెప్టెంబర్ 3న కోటమర్తి గ్రామానికి చెందిన మలిపెద్ది సోమక్క (65) తన ఇంట్లో గ్యాస్ సిలిండర్ చోరీకి గురైందని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా అనుమానాస్పదంగా ఉన్న వెంకటేష్, పరుశరాములను అదుపులోకి తీసుకొని విచారించగా కొంతకాలంగా గ్రామంలోని తాళం వేసిన ఇళ్లలో టార్గెట్ చేసి సిలిండర్లు ఇత్తడి వస్తువులు ఇనుప వస్తువులను చోరీ చేసి వేరే ప్రాంతాలలో విక్రయిస్తున్నట్లు అంగీకరించారని పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి 3 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకొని వారిద్దరిని రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై వెంకట్ రెడ్డి తెలిపారు.

# ఎస్.పి.ఆర్. ఎల్లాపూర్‌లో మెగా రక్తదాన శిబిరం

హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ

హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండలం ఎల్లాపూర్ శివారులోని ఎస్.పి.ఆర్. స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రెడ్ క్రాస్ సొసైటీ, హన్మకొండ వారి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శ్రీ గౌరిశెట్టి జగన్మోహన్ గారు మాట్లాడుతూ, ఈ రోజుల్లో రక్తదానం ఒక సామాజిక అవసరమని, ప్రాణాలను నిలబెట్టే శక్తి రక్తానికి ఉందని, అలాగే ఆరోగ్యంగా ఉండాలంటే రక్త శుద్ధి తప్పనిసరని, అందుకే సంవత్సరానికి కనీసం రెండు సార్లు రక్త దానం చేయాలనీ, అది పౌరుని సామాజిక బాధ్యతగా భావించాలనీ, ఒక వ్యక్తి రక్తదానం చేయడం వల్ల మరో నలుగురిని కాపాడవచ్చని, ప్రాణాలను కాపాడే ప్రయాణంలో ప్రతి రక్తపు చుక్కా విలువైనదేనని, అదే విధంగా ఈనాటి విద్యార్థినీ విద్యార్థులైన మీరు ఈ కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకొని రేపటి బావిభారత పౌరులుగా ఇలాంటి సామాజిక కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. నేటి సమాజంలో ప్రతీది వ్యాపారంగా చూస్తున్న తరుణంలో నా ఆలోచనలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేషగిరిరావు గారు, ఉపాధ్యాయులు, సహోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, మిత్రులు, శ్రేయోభిలాషులు




ముందుకు రావడం వలన రెడ్ క్రాస్ సొసైటీ, హన్మకొండ ఆధ్వర్యంలో పాఠశాలలో 50 మంది రక్త దానం చేయడం జరిగిందని తెలిపారు.

అదే విధంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేషగిరిరావు గారు మాట్లాడుతూ నేటి సమాజంలో మానవ జీవితం ఉరుకులు పరుగులతో జీవితాన్ని సాగిస్తున్నారు, ఆ తొందరలో ఎంతో మంది రహదారుల్లో మోటారు వాహనాలు అతి వేగంగా, అజాగ్రత్తగా నడిపి అనేక ప్రమాదాలకు గురి అవుతున్నారు. వారిని కాపాడడానికి అత్యవసరంగా రక్తం అవసరమవుతుంది కాబట్టి అలాంటి వారిని కాపాడుకోవడం కోసం రక్త దానం చేయాల్సిన అవసరం ఎంతో ఉందని, అన్ని దానాలలోకెల్ల రక్తదానంతో ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చునని వివరించారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులు ఉపాధ్యాయులకు సన్మానం చేసి వారి గురు భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు గురువుల గొప్పతనాన్ని తెలియజేసే సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# టీఎంజెఎఫ్ మండల అధ్యక్షున్ని నియామకం



హైదరాబాద్ ఎస్టేట్స్ తుంగతుర్తి నియోజకవర్గం
అడ్డగూడూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ మాదిగ జర్నలిస్ట్స్ పోరం (టీజీఫ్) యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధానకార్యదర్శి గూడెపు పరమేష్ అధ్యక్షతన నూతన మండల కమిటీకి హాజరైన సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా అడ్డగూడూరు మండల అధ్యక్షులుగా నీర్మాల వెంకటేశ్వర్లు ను నియమించారు ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి గూడెపు పరమేష్ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం చొరవ చూపాలని అక్రిడేషన్ తో సంబంధం లేకుండా ఇల్లు , ప్రతి ఒక్కరికి హెల్త్ కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

అడ్డగూడూరు మండల అధ్యక్షులు నిర్మాల వెంకటేశ్వర్లు
ఉపాధ్యక్షులు నీర్మాల సందీప్
ప్రధాన కార్యదర్శి
బాలెంల పరశురాములు
కార్యదర్శి మందుల నర్సింహ్మా
సభ్యులు గూడెపు నాగరాజు , బాలెంల కల్యాణి , పనుమటి సైదులు , కడెం రవికళ, చింత సుధాకర్ , తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సీఎం కే సీ ఆర్ రూ. 23 కోట్ల జీతం తీసుకొని....

# ఒక రోజు కూడా అసెంబ్లీకి రాని ప్రతిపక్షనేత కేసీఆర్ రాజీనామా చేయాలి..

**ఆదివారం ఉదయం 10 గంటలకు ఇందిరా పార్కు ధర్నా చౌక్-నేడు చలో ఇందిరా పార్కు కార్యక్రమం విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపు**

**వెయ్యి రోజుల పాలనపై ర్యాలీలు... ప్రెస్ మీట్ లు ఏర్పాట్లు....విజయోత్సవ సభలు ఏర్పాటు చేయండి**

**మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరశీ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి పిలుపు**

హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 5 మాజీ సీఎం కేసీఆర్ వెంటనే రాజీనామా చేయాలని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరశీ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గంలోని 15 జిహెచ్ఎంసి డివిజన్లో, రెండు మండలాల పార్టీ సీనియర్ నాయకులు 17 మంది ప్రెసిడెంట్లతో కే ఎల్ ఆర్ జూమ్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....మాజీ ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు రూ. 23 కోట్ల రూపాయల జీతం తీసుకొని..ఒక రోజు కూడా అసెంబ్లీకి రాని ప్రతిపక్షనేత కేసీఆర్ రాజీనామా చేయాలన్నారు. చలో ఇందిరా పార్క్ ధర్నా చౌక్ టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి లిఎనుముల రేవంత్ రెడ్డి ల పిలుపుమేరకు ఆదివారం ఉదయం 10 గంటలకు ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద బిఆర్ఎస్ పార్టీ నాయకుడు గజ్వేల్ శాసనసభ్యుడు కల్వకుంట్ల చంద్రశేఖర రావు ప్రతిపక్ష హోదా తీసుకొని వెయ్యి రోజులలో సుమారు 23 కోట్ల రూపాయలు ప్రజలు కట్టిన పన్నుల నుండి ప్రభుత్వం జీతభత్యాలు తీసుకుంటూ బుల్లెట్ ప్రూఫ్ వాహనంతోపాటు అన్ని వసతులు వాడుకుంటున్న ప్రతిపక్ష నాయకుడు... అసెంబ్లీకి రానీ ప్రజల పక్షాన నిలబడని ప్రతిపక్ష హోదా ఎందుకని వారు శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నేడు చేసే కార్యక్రమం విజయవంతశీ చేయాలని పిలుపు నిచ్చారు.

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు మహిళా నాయకురాలు ఎన్ ఎస్ యు ఐ యూత్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అందరూ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ లో జరిగే ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజల పన్నుల డబ్బుతో కోట్లు వేతనం " అసెంబ్లీకి హాజరు శూన్యం.." ప్రజా సమస్యలపై చర్చ లేదు." అధికారంలో ఉన్న సమయంలో ఇచ్చిన హామీలు గాలికొదిలారని మండిపడ్డారు. ప్రజల పట్ల మన బాధ్యతను కూడా గుర్తుంచుకోవాలి. పదవులు ప్రజల కోసం, అధికారం ప్రజల సేవ కోసం. ప్రజల సమస్యలను పట్టించుకోని రాజకీయాలకు ప్రజాస్వామ్యంలో స్థానం ఉండకూడదన్నారు.

మన పార్టీ కార్యకర్తలు క్రమశిక్షణతో, ఐక్యతతో పనిచేయాలనీ, సోషల్ మీడియాలో కూడా వాస్తవాలను మాత్రమే ప్రచారం చేయాలి. వ్యక్తిగత విమర్శలకు దూరంగా ఉండి, ప్రజా సమస్యలు, ప్రభుత్వ పనితీరు, అభివృద్ధి అంశాలపై చర్చ జరగాలన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలి, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం చేస్తున్న కార్యక్రమాలను ప్రతి ఇంటికితీసుకెళ్లాలన్నారు.తెలంగాణ ప్రజల ఆకాంక్షల కోసం కాంగ్రెస్ పార్టీ మరోసారి ప్రజాక్షేత్రంలోకి అడుగుపెడుతోందన్నారు.

నేడు నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలోమహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం నుండి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ, తెలంగాణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలి. గత పాలకుల వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తూ, తెలంగాణ భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కృషిని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని...

రండి.. కలిసికట్టుగా కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామన్నారు.

అదే సమయంలో, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజులు పూర్తయిన సందర్భంగా, ఈ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఎంతవరకు అమలు చేసిందో వివరించాలి... రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ వంటి పథకాల ద్వారా



ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను వివరించాలి... ప్రజల సమస్యలను కూడా మనం వినాలి. ఏ పథకం అందలేదో, ఏ సమస్య పరిష్కారం కాలేదో, ఎక్కడ అధికారులు స్పందించలేదో తెలుసుకుని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి. ప్రజల సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు.

ఈ జూమ్ మీటింగ్లో పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా దాసరి చిన్న రాములు

## -40 నుంచి 136 కు విద్యార్థులను పెంచినందుకు ఈ అరుదైన గౌరవం

హైదరాబాద్ ఎస్టేట్ లక్ష్మీ నారాయణ వనపర్తి జిల్లా ప్రతినిధి ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవం కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులకు ఆయన చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేయడం జరిగింది. అందులో భాగంగా వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని పీర్లా, పెబ్బేరు చెంచువాడ పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు దాసరి చిన్న రాములు కు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందజేయడం జరిగింది. విద్యార్థుల సంఖ్యను 40 నుండి 136 పెంచినందుకు, పాఠశాలకు మౌలిక వసతులు సమకూర్చినందుకు, విద్యార్థుల విద్యాభివృద్ధి, పాఠశాల అభివృద్ధి, నూతన బోధనా పద్ధతుల అమలు, విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడంలో ఆయన చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో యోగితా రాణా, ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి, వికారాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని పాల్గొని దాసరి చిన్న రాములు గారిని ఘనంగా అభినందించారు. రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ




అవార్డు పొందడం పట్ల పెబ్బేరు ప్రాంత విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ దాసరి చిన్న రాములు గారికి అభినందనలు తెలిపారు.

# ఎమ్మెల్యే గారు జిల్లా కలెక్టర్ గారు కరెంట్ సమస్యను పరిష్కరించి ప్రజల ప్రాణాలు కాపాడాలి

## ??విద్యుత్తు సరఫరాలో సమస్య ఉంటే మధ్యాహ్నం సరి చేయాలి రాత్రి వేళలో కాదు

## అంబేద్కర్ యువజన సంఘంరాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య

హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్ జిల్లా మండల గ్రామాలలో రోజురోజుకీ కరెంటు వేళా పాల లేకుండా పోతుందని దాని వలన ప్రజలు మహిళలు గర్భిణీలు బాలింతలు ఇబ్బందులు పడుతున్నారని స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గారు మరియు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ గారు సంబంధించిన జిల్లా మండల విద్యుత్ అధికారులు కరెంటు సమస్యను పరిష్కరించి ప్రజల ప్రాణాలు కాపాడాలని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య కోరారు

ఈ రోజు జయశంకర్ భూపాలపల్లి జిల్లాచిట్యాల మండల కేంద్రంలో మల్లయ్య మాట్లాడుతూ గత వారం రోజులుగా జిల్లావ్యాప్తంగా అనేక గ్రామాలలో కరెంట్ వేలా పాలా లేకుండా పోతుంది దాని వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి సమయాల్లో కూడా కరెంటు పోవడం వలన చిన్న పిల్లలు పెద్దలు యువతి యువకులు మహిళలు బాలింతలు గర్భిణీ స్త్రీలు ప్రతి ఒక్కరు అవస్థలు పడుతున్నారు . అసలే వర్షా కాలంలో కరెంట్ పోవడం తో పాములు తేళ్ళు విషపురుగులు ప్రజలను కరుస్తున్నాయని వాటితో పాటు విపరీతమైన దోమలు తట్టుకో లేక పోతున్నామన్నారు. కరెంట్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని ముఖ్యంగా సబ్ స్టేషన్లో ఏదైనా సమస్య ఉంటే మధ్యాహ్నం సరి చేయాలి తప్ప రాత్రి వేళలో కాదన్నారు. వెంటనే సంబంధించిన విద్యుత్ అధికారులు కరెంటు సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని కోరారు.




# ఉపాధ్యాయుల సేవలు గ్రామాభివృద్ధికి బలం

## -- గీసుకొండలో ఉపాధ్యాయులకు ఘన సన్మానం

గీసుకొండ, సెప్టెంబర్ 5 హైదరాబాద్ ఎస్టేట్:
గ్రామాభివృద్ధిలో ఉపాధ్యాయుల సేవలు ఎంతో కీలకమని గ్రామ శ్రీమంతుడు పెగాళ్లపాటి లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం గీసుకొండ గ్రామంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, మండల వనరుల కేంద్రం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు గ్రామాభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. గ్రామ సర్పంచ్ వీరగోని రాజ్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తానన్నారు. పాఠశాలల అభివృద్ధికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, మౌలిక సదుపాయాల కల్పనకు సహకరిస్తానని తెలిపారు. ఎంఈఓ ఎస్. రవీందర్ మాట్లాడుతూ లక్ష్మీనారాయణ సేవాభావంతో పాఠశాలలతోపాటు గ్రామాభివృద్ధికి అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యురాలు మమత, ప్రాథమిక పాఠశాల కమిటీ సభ్యురాలు ఉమారాణి, గతంలో పాఠశాలలో పనిచేసిన పట్టాభి, చంద్రకళ, సంఘం శ్రీనివాస్, లచ్చిరాంలను కూడా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# కుడా చైర్‌పర్సన్‌గా గుండు సుధారాణి

**- బాధ్యతలు స్వీకరణ.. - ప్రణాళికాబద్ధ పట్టణాభివృద్ధికి ప్రాధాన్యం**

**- మౌలిక వసతులు, ప్రజా సౌకర్యాల మెరుగుదలే లక్ష్యమని వెల్లడి**



హైదరాబాద్ ఎస్టేట్, హనుమకొండ, సెప్టెంబర్ 5:
కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్‌పర్సన్‌గా గుండు సుధారాణి బాధ్యతలు స్వీకరించారు. హనుమకొండలోని కుడా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కుడా వైస్‌చైర్మన్, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తదితరుల సమక్షంలో ఆమె పదవీ బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన సుధారాణికి ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ పుష్పగుచ్ఛాలు, పూల మొక్కలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కుడా అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కుడా పరిధిలో ప్రణాళికాబద్ధమైన పట్టణాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని, మౌలిక వసతులను బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందేలా కృషి చేస్తామని చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కుడా సీపీఓ అజిత్‌రెడ్డి, ఈఈ భీమ్‌రావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సేవా స్ఫూర్తితో ఉపాధ్యాయులకు జయరాజు సన్మానం



హైదరాబాద్ ఎస్టేట్, హనుమకొండ, సెప్టెంబర్ 5:
జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా భీమారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ జి. జయరాజు సత్కరించారు. ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలతో మమేకమై విధి నిర్వహణతో పాటు సేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొనే జయరాజు, తన సేవలకు గుర్తింపుగా పలు అవార్డులు అందుకున్నారు. సమాజానికి దిశానిర్దేశం చేసే ఉపాధ్యాయులను ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సన్మానించడం ద్వారా తన సేవా స్ఫూర్తిని మరోసారి చాటుకున్నారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమన్నారు. విద్యాబోధనతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుల సేవలు సమాజానికి ఎంతో విలువైనవని కొనియాడారు.

## పిల్లల విజయమే లక్ష్మీదేవమ్మకు నిజమైన నివాళి

### - మడే బిక్షపతి ఘన నివాళి

హనుమకొండ, సెప్టెంబర్ 5 హైదరాబాద్ ఎస్టేట్:
పేద కుటుంబంలో జన్మించినప్పటికీ తన ఆరుగురు పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్ది, సమాజానికి సేవ చేసే స్థాయికి తీసుకువచ్చిన గడ్డం లక్ష్మీదేవమ్మ జీవితం ఆదర్శప్రాయమని ఎస్సీ, ఎస్టీ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడే బిక్షపతి అన్నారు. హనుమకొండ ఎక్సైజ్ కాలనీలో నివాసం ఉంటున్న ఉపాధ్యాయుడు గడ్డం సురేష్ తల్లి లక్ష్మీదేవమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె దశదినకర్మ శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మడే బిక్షపతి లక్ష్మీదేవమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను పెద్దగా విద్యాభ్యాసం చేయకపోయినా పిల్లల చదువుకు ప్రాధాన్యం ఇచ్చి వారి భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు లక్ష్మీదేవమ్మ చేసిన కృషి, త్యాగం మరువలేనిదన్నారు. ఆమె పిల్లలు తమ వృత్తుల్లో రాణించడంతోపాటు సామాజిక సేవలోనూ ముందుండటం ఆమె పెంపకానికి నిదర్శనమన్నారు. గడ్డం సురేష్ భూపాలపల్లి జిల్లాలోని కమలాపూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా సేవలందిస్తూ విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని తెలిపారు. పేద విద్యార్థులకు అండగా నిలుస్తూ, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పిస్తూ మార్గనిర్దేశం చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులతోపాటు పలువురు ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొని లక్ష్మీదేవమ్మకు నివాళులర్పించారు.

## సాప్ నివేదికల నమోదును వేగవంతం చేయాలి

**-పెండింగ్ వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి**

**-విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు: -జిల్లా పరిషత్ సీఈఓ ఎన్. వసంత**



గీసుకొండ, సెప్టెంబర్ 5 హైదరాబాద్ ఎస్టేట్:
మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు సంబంధించిన సాప్ నివేదికలు, గ్రామ ప్రొఫైల్ వివరాల నమోదును వేగవంతం చేసి, ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని జిల్లా పరిషత్ సీఈఓ ఎన్. వసంత అధికారులను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. శనివారం గీసుకొండ మండల పరిషత్ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా మండలానికి వచ్చిన సీఈఓ వసంతకు ఎంపీడీఓ కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. గ్రామాల వారీగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న గ్రామ ప్రొఫైల్ వివరాల నమోదుతో పాటు గ్రామాభివృద్ధి ప్రణాళికలకు సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పూర్తయిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. పంచాయతీలకు నిర్దేశించిన పనులను సమన్వయంతో పూర్తి చేసి, నివేదికలను సకాలంలో అందజేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఎంపీఓ టి. శేషాంజన్ స్వామి, సూపరింటెండెంట్ కమలాకర్, ఏపీఓ చంద్రకాంత్, ఈసీ శ్రీలత, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ ఆపరేటర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

## మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా మడే బిక్షపతి, డి. సునీల్ కుమార్

### - విద్యార్థుల భవిష్యత్తుకు అంకితమైన సేవలకు గుర్తింపు



ఆత్మకూరు, సెప్టెంబర్ 5 హైదరాబాద్ ఎస్టేట్:
విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు వారి భవిష్యత్తు తీర్చిదిద్దేందుకు అంకితభావంతో సేవలందిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులకు మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు లభించాయి. మద్దాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడే బిక్షపతి, మద్దాపూర్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు డి. సునీల్ కుమార్ ఈ పురస్కారాలకు ఎంపికయ్యారు. విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా వారు చేస్తున్న నిస్వార్థ సేవ, విద్యాబోధనలో చూపుతున్న అంకితభావానికి ఈ పురస్కారం గుర్తింపుగా నిలిచింది. ఇద్దరు ఉపాధ్యాయులకు పురస్కారాలు లభించడం పట్ల పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.



## ఉపాధ్యాయుల సేవలు చిరస్మరణీయం

**- 42 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం**



గీసుగొండ, సెప్టెంబర్ 5 హైదరాబాద్ ఎస్టేట్:
విద్యార్థుల భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తూ సమాజ అభివృద్ధికి ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు ఎంతో కీలకమని తహసీల్దార్ రియాజుద్దీన్ అన్నారు. మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 42 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తహసీల్దార్ రియాజుద్దీన్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యతోపాటు విలువలు, క్రమశిక్షణను అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ప్రత్యేకమన్నారు. ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి సన్మానించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఎంఈఓ ఎస్. రవీందర్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపి వారి ప్రతిభను వెలికితీయాలని సూచించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచడంతోపాటు వారిని ఉన్నత లక్ష్యాల వైపు నడిపించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందేలా సమష్టిగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్కుర్తి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రంగనాథ్, కొమ్మాల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రావు, స్థానిక ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు పద్మతోపాటు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

**(శాసనమండలి సభ్యులు ప్రొఫెసర్ ఎం. కోదండరాం గారి జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు వారికి హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడటంలో భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ఆకాంక్షించారు.**

## నడిరోడ్డుపై బైక్ తో యువకుడు స్టంట్ లు,, ప్రజలు భయబ్రాంతులకు గురైయ్యేలా ప్రమాదకర విన్యాసాలు..

-స్టంట్ చేసిన యువకుడిపై కేసు నమోదు, యువకుడు అరెస్ట్.

-బైక్ సీజ్.. కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరించిన పోలీస్.



సూర్యాపేట జిల్లా మఠంపల్లి ప్రధాన సెంటర్‌లో ప్రమాదకరంగా బైక్‌పై స్టంట్ విన్యాసాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న లిపర్వతం గోపీచంద్ (19) అనే యువకున్ని మఠంపల్లి పోలీసులు పట్టుకున్నారు.
జాన్‌పాడు--మట్టపల్లి రోడ్డులో ఒంటి చక్రంపై బైక్ నడుపుతూ ప్రమాదకర విన్యాసాలు చేస్తున్న యువకుడిని అదుపులోకి తీసుకుని, బైక్‌ను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. యువకుడితో పాటు బైక్ ఇచ్చిన అతని మామపై కూడా కేసు నమోదు చేశారు.రద్దీ ప్రాంతాల్లో ఇలాంటి ప్రమాదకర స్టంట్లు చేస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ చారమందరాజు హెచ్చరించారు. వెంటనే స్పందించి స్టంట్ లు చేసిన యువకుని పై చర్యలు తీసుకున్న ఎస్సై ప్రవీణ్ కుమార్, పోలీస్ సిబ్బంది చర్యలను స్థానికులు అభినందించారు.

## ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

**- చౌల్లపల్లి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి**

**- విద్యార్థులతో కలిసి అల్పాహారం.. సౌకర్యాలపై ఆరా**

హైదరాబాద్ ఎస్టేట్, హనుమకొండ, సెప్టెంబర్ 5:
ఆత్మకూరు మండలం చౌల్లపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, అల్పాహారం తదితర అంశాలను పరిశీలించిన అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యారంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారిని భావి దేశ పౌరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అల్పాహార పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కార్పొరేట్ తరహా మౌలిక వసతులతో పాటు విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, నాణ్యమైన ఉచిత విద్య అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.



## 22(ఎ) భూముల సమస్యపై బీజేపీ మహాదీక్ష

**- ఇందిరాపార్క్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఆధ్వర్యంలో ఆందోళన**

**- దీక్షకు వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ సంఘీభావం**

హైదరాబాద్ ఎస్టేట్, హైదరాబాద్, సెప్టెంబర్ 5:
భూభారతి చట్టంలోని 22(ఎ) కింద నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహాదీక్ష నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి ఆధ్వర్యంలో కొనసాగిన ఈ దీక్షలో బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ పాల్గొని సంఘీభావం తెలిపారు. దీక్షకు ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు కనుకుంట్ల రంజిత్‌కుమార్, గుర్రాల చంద్రమౌళి, బైరి నాగరాజు, వంచనగిరి రాజ్‌కుమార్ తదితరులు హాజరై మద్దతు తెలిపారు. 22(ఎ) నిషేధిత జాబితాలో ఉన్న భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ మహాదీక్ష చేపట్టినట్లు పార్టీ నాయకులు తెలిపారు. భూముల సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి పరిష్కారం లభించేలా ప్రభుత్వం స్పందించాలని వారు కోరారు.



## కార్యకర్తల అభిప్రాయమే కీలకం

**- వరంగల్ తూర్పులో బీజేపీ బలంగా ఉంది**

**- పార్టీలో చేరికలపై క్షేత్రస్థాయి అభిప్రాయానికి ప్రాధాన్యం ఇవ్వాలి: రంజిత్‌కుమార్**

హైదరాబాద్ ఎస్టేట్, వరంగల్, సెప్టెంబర్ 5:
వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బీజేపీకి బలమైన నాయకత్వంతో పాటు క్షేత్రస్థాయిలో కార్యకర్తల మద్దతు ఉందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు కనుకుంట్ల రంజిత్‌కుమార్ అన్నారు. పార్టీ బలోపేతం కోసం పనిచేస్తున్న కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఇతర పార్టీలకు చెందిన వారిని చేర్చుకోవద్దని పార్టీ నాయకత్వానికి సూచించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు నాయకత్వంలో పార్టీ బలంగా ఉందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తల మనోభావాలకు ప్రాధాన్యం ఇస్తే సంస్థాగతంగా మరింత బలోపేతం అవుతుందని అన్నారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలు సాధిస్తుందని రంజిత్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బీజేపీ కాషాయ జెండా ఎగరడం ఖాయమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.



## పరకాలలో ఉద్రిక్తత.. పోలీసులతో బీఆర్‌ఎస్‌వీ నేతల తోపులాట

**- చల్లా ధర్మారెడ్డి ఆధ్వర్యంలో ధర్నా.. విద్యార్థుల సంఘీభావం**




పరకాల, సెప్టెంబర్ 5 హైదరాబాద్ ఎస్టేట్:
పరకాల అంబేద్కర్ సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా ఉద్రిక్తతకు దారితీసింది. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ బీఆర్‌ఎస్‌వీ నాయకులు చేపట్టిన ఆందోళనకు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు సంఘీభావం తెలిపారు. ఆందోళనకారులు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేశారు. ధర్నాను నియంత్రించేందుకు పోలీసులు ప్రయత్నించడంతో బీఆర్‌ఎస్‌వీ నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మాటామాటా పెరగడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. దీంతో అంబేద్కర్ సెంటర్‌లో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు అదనపు బందోబస్తు ఏర్పాటు చేసి ఆందోళనను నియంత్రించారు. అనంతరం పరిస్థితి సద్దుమణిగింది.

# యువత హామీలపై సమరం.. కందుకూరులో బీఆర్ఎస్ నిరసన

## -1000 రోజులు.. యూత్ హామీలు ఎక్కడ

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి సెప్టెంబర్ 5:- కందుకూరు: ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తైన సందర్భంగా కందుకూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ యూత్ విభాగం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల యూత్ అధ్యక్షుడు తాళ్ల కార్తీక్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలో యువతకు ఇచ్చిన యూత్ డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నె జయేందర్ ముదిరాజ్, జిల్లా నాయకుడు గంగాపురం లక్ష్మీ నర్సింహ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు యువతకు భరోసా కల్పించిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీల అమలును విస్మరించిందని ఆరోపించారు. ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ యువతకు ఆర్థిక భరోసా, ఉపాధి అవకాశాలు, విద్యార్థులు--యువత సంక్షేమానికి సంబంధించిన అంశాల్లో ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ చూపడం లేదని విమర్శించారు. వేలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో ఖాళీలను గుర్తించి నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.

యువత భవిష్యత్తుతో రాజకీయాలు చేయకుండా




ఎన్నికల హామీలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని అన్నారు. హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన వచ్చే వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలను కొనసాగిస్తామని నాయకులు హెచ్చరించారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, యూత్ విభాగం ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# పేదల కోసం ప్రభుత్వ ఆసుపత్రి..

## కబ్జా భూములపై ఎమ్మెల్యే ఫోకస్

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి సెప్టెంబర్ 5:-
ఇబ్రహీంపట్నంలో నిర్మాణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి పనులను ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆకస్మికంగా పరిశీలించారు. పనుల్లో జాప్యంపై అధికారులపై, కాంట్రాక్టర్‌పై అసహనం వ్యక్తం చేసిన ఆయన.. నిర్ణీత గడువులోగా నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఆస్పత్రి నిర్మాణానికి ఇప్పటికే రూ. 50 కోట్లు కేటాయించామని, అవసరమైతే



మరో రూ. 50 కోట్లు కూడా మంజూరు చేయిస్తామని అన్నారు. పాత భవనాన్ని తొలగించి.. ఆధునిక సౌకర్యాలతో కొత్త ఆస్పత్రి నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. ఇదే సమయంలో నియోజకవర్గంలో గతంలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ నేతలు అక్రమంగా కబ్జా చేశారనే ఆరోపణలు ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూములను కూడా వెలికి తీస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కబ్జాలకు గురైన భూములను తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని.. అర్హులైన పేద ప్రజలకు పంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# జీవితంపై విరక్తితో యువకుడు ఆత్మహత్య:

**చిట్యాల ఎస్ఐ**

**పోచంపల్లి సతీష్ వెల్లడి**

హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్ చిట్యాల: చిట్యాల మండల పరిధిలోని పాసింగడ్డ తండాకు చెందిన భూక్య తిరుపతి అలియాస్ సురేష్ (22) అనే యువకుడు ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్ తెలిపారు. పోలీసులు మరియు మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... పాసింగడ్డ తండాకు చెందిన భూక్య తిరుపతి తల్లిదండ్రులు సుమారు ఎనిమిది సంవత్సరాల క్రితమే మృతి చెందారు. దీంతో తిరుపతి తన చదువును ఆపేసి, కూలీ పనులు చేసుకుంటూ తన ఇద్దరు తమ్ముళ్లు, ఒక చెల్లెలి బాగోగులు చూసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తల్లిదండ్రులు లేకపోవడం, తోబుట్టువుల పోషణ భారం కావడంతో తీవ్ర మనస్తాపానికి గురైన తిరుపతి జీవితంపై విరక్తి చెందాడు.

?ఈ క్రమంలో ఈ నెల 04వ తేదీ (నిన్న) సాయంత్రం సుమారు 7:00 గంటల సమయంలో తన ఇంట్లోని ఐరన్ పైపుకు నైలాన్ తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి కిందికి దించేలోపే అతను మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుని కుటుంబసభ్యుడు భూక్య రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు, మృతదేహాన్ని పంచనామా నిమిత్తం తరలించినట్లు ఎస్ఐ పోచంపల్లి సతీష్ పేర్కొన్నారు.



# హామీలే తప్ప.. అమలు ఏది..?

## విద్యార్థులతో టీఆర్ఎస్ భారీ ర్యాలీ







హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి సెప్టెంబర్ 5:-
ఇబ్రహీంపట్నంలో విద్యార్థుల సమస్యలపై టీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఇన్ని రోజులు గడుస్తున్నా.. విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని టీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. సుమారు రెండు వేల మంది విద్యార్థులతో ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డ్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ చేపట్టారు. విద్యార్థులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులు గడిచినా విద్యార్థుల కోసం చెప్పుకోదగ్గ స్థాయిలో చేసిందేమీ లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం తమ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. టీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. హామీల అమలులో ఇంకా జాప్యం చేస్తే.. విద్యార్థులను సమీకరించి పెద్ద ఎత్తున ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.
విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని టీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

# బురద రాజకీయాలు బంద్ చేయాలి!

## -దమ్ముంటే చర్చకు రండి: మల్‌రెడ్డి రంగారెడ్డి




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి సెప్టెంబర్ 5:-
అబ్దుల్లాపూర్‌మెట్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం రాజకీయ విమర్శలకు వేదికగా మారింది. ప్రజా సంక్షేమంపై మాట్లాడకుండా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు పేదల సమస్యలను పట్టించుకోని వారు ఇప్పుడు ప్రజల కోసం పోరాడుతున్నట్లు నటించడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో భాగంగా పలువురు అర్హులైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే నూతన స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల వంటి కార్యక్రమాలతో నిరుపేదలకు ప్రయోజనం కలుగుతోందన్నారు. గత పదేళ్ల పాలనకు, ప్రస్తుత ప్రభుత్వ పాలనకు మధ్య అభివృద్ధి, సంక్షేమంపై బహిరంగంగా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని మల్‌రెడ్డి సవాల్ విసిరారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యక్తిగత విమర్శలు, బురద రాజకీయాలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇంటి స్థలం లేని వారికి కూడా గృహ వసతి కల్పించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అవసరమైన ప్రాంతాల్లో మరిన్ని రేషన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ప్రతినిధులు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



# అంబేద్కర్‌ను చులకన చేయడం నుంచి "కల్పిత నాయకుడు" వరకు...

## హమారా ప్రసాద్ ఆలోచనా పతనానికి ఇదే నిదర్శనం!

**"అంబేద్కర్ వందల పుస్తకాలు చదివి, అనేక గ్రంథాలు రాసి, పత్రికలు నడిపి ప్రజలను చైతన్యపరిచారు..**

**హమారా ప్రసాద్ మాత్రం కల్పిత కథనాలతో చరిత్రను వక్రీకరి స్తున్నారా?"**

**డా. పిట్టా వరప్రసాద్, ఆర్‌పీఐ (అంబేద్కర్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు, తీవ్రస్థాయి విమర్శలు**

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధికాకినాడ, ఆగస్టు 30, 2026:
డా. బి.ఆర్. అంబేద్కర్‌పై తొలినాళ్ల నుంచే చులకనగా వ్యాఖ్యలు చేస్తూ, సోషల్ మీడియాలో వివాదాస్పద వ్యాఖ్యానాలు చేస్తూ వచ్చిన హమారా ప్రసాద్, ఇప్పుడు "కల్పిత నాయకుడు" పేరుతో నవల రాయడం ద్వారా అదే ధోరణిని మరింత ముందుకు తీసుకెళ్లారని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు డా. పిట్టా వరప్రసాద్ మరియు జాతీయ కార్యదర్శి తీవ్రంగా విమర్శించారు.
"అంబేద్కర్‌పై విమర్శ చేయాలంటే ముందుగా అంబేద్కర్‌ను చదవాలి. ఆయన జీవితాన్ని, ఆయన పోరాటాన్ని, ఆయన రచనలను, ఆయన ఆలోచనలను అర్థం చేసుకోవాలి. అంబేద్కర్‌ను అర్థం చేసుకోకుండా ఆయనపై తీర్పులు చెప్పడం అజ్ఞానానికి నిదర్శనం" అని డా. పిట్టా వరప్రసాద్ ఘాటుగా అన్నారు.

**అంబేద్కర్ కలం ఒక సామాజిక విప్లవానికి ఆయుధం**

డా. బి.ఆర్. అంబేద్కర్ కేవలం రాజకీయ నాయకుడు మాత్రమే కాదని, ఆయన మహా మేధావి, న్యాయవేత్త, ఆర్థికవేత్త, రచయిత, సంపాదకుడు, సామాజిక సంస్కర్త మరియు ప్రజా చైతన్య ఉద్యమకారుడు అని వారు పేర్కొన్నారు.
అంబేద్కర్ అనేక ప్రామాణిక గ్రంథాలను రచించారని, అటువంటి రచనల ద్వారా భారత సమాజం, ఆర్థిక వ్యవస్థ, కుల వ్యవస్థ, సామాజిక అసమానతలపై శాస్త్రీయ విశ్లేషణ అందించారని తెలిపారు.
అంతేకాకుండా "మూకనాయక్", "బహిష్కృత భారత్", "జనతా" వంటి పత్రికల ద్వారా అణగారిన ప్రజల సమస్యలను ప్రజల ముందుకు తీసుకువచ్చి, వారిలో ఆత్మగౌరవం, హక్కులపై అవగాహన, చైతన్యం కల్పించారని గుర్తుచేశారు.
"అంబేద్కర్ కలం కేవలం కాగితంపై అక్షరాలను రాయలేదు---శతాబ్దాలుగా అణచివేయబడిన ప్రజల గొంతుకగా మారింది. ఆయన రచనలు కేవలం పుస్తకాలు కాదు; అవి సామాజిక మార్పుకు మార్గదర్శకాలు. ఆయన ఆలోచనలు భారతదేశానికే కాకుండా ప్రపంచవ్యాప్తంగా సామాజిక న్యాయం, సమానత్వం గురించి జరిగే చర్చలకు ప్రామాణికంగా నిలిచాయి" అని డా. పిట్టా వరప్రసాద్ అన్నారు.
"ఒకవైపు అంబేద్కర్ జీవితాంతం చదివి, రాసి, ప్రజలను చైతన్యపరిస్తే.. మరోవైపు కల్పిత కథనాలతో ఆయనను చులకన చేయాలనుకుంటున్నారా అని ప్రశ్నించారు
"అంబేద్కర్ వేలాది పేజీలు చదివారు. ప్రపంచంలోని రాజ్యాంగాలను అధ్యయనం చేశారని. ఆర్థిక శాస్త్రం, న్యాయశాస్త్రం, రాజకీయ శాస్త్రం, సమాజ శాస్త్రంపై లోతైన పరిశోధనలు తో పాటు అనేక గ్రంథాలు రచించారు. పత్రికలు నడిపారు. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారు. చివరకు భారత రాజ్యాంగ నిర్మాణంలో కీలక పాత్ర పోషించి దేశానికి ఒక శక్తివంతమైన ప్రజాస్వామ్య పునాది వేశారు అని తెలిపారు
"అలాంటి మహోన్నత మేధావిని అర్థం చేసుకోకుండా, కల్పిత పాత్రలతో ఆయనను కొలవాలని ప్రయత్నించడం ఎంతవరకు సమంజసం? హమారా ప్రసాద్ ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాలి" అని అన్నారు.

**"అంబేద్కర్‌ను ఒక నవలతో చిన్నచూపు చూడలేరు!"**

"హమారా ప్రసాద్! ఒక నవల రాయడం మీ హక్కు. మీకు నచ్చిన పాత్రలను సృష్టించుకోవడం మీ సాహిత్య స్వేచ్ఛ. కానీ అంబేద్కర్ వంటి చారిత్రక మహానుభావుడిని, ఆయన రచనలను, ఆయన పోరాటాలను వక్రీకరించి ప్రజల ముందుకు తీసుకురావడాన్ని మాత్రం మేము ప్రశ్నిస్తాం." అని అన్నారు
"మీరు అంబేద్కర్‌ను విమర్శించాలనుకుంటే ఆయన రచనలు చదవండి. ఆయన పుస్తకాలకు సమాధానం పుస్తకాలతో ఇవ్వండి. ఆయన ఆర్థిక సిద్ధాంతాలను విమర్శించాలంటే ఆర్థిక శాస్త్రంతో విమర్శించండి. ఆయన రాజ్యాంగ ఆలోచనలను ప్రశ్నించాలంటే రాజ్యాంగపరమైన ఆధారాలతో మాట్లాడండి. కానీ కల్పిత కథలతో అంబేద్కర్‌ను చిన్నచూపు చూడాలనుకోవడం మీ బలహీనతను మాత్రమే బయటపెడుతుంది" అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు.

**"ఎవరి మెప్పు కోసం అంబేద్కర్‌పై ఈ దాడి?"**

"హమారా ప్రసాద్ తొలినాళ్ల నుంచి సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలు, ఇప్పుడు 'కల్పిత నాయకుడు' పేరుతో వస్తున్న రచన---ఇవన్నీ కలిపి చూస్తే అంబేద్కర్ భావజాలంపై ఒక నిరంతర వ్యతిరేక ధోరణి కనిపిస్తోంది. ఈ ధోరణి ఎవరి ప్రయోజనాలకు ఉపయోగపడుతుంది? ఎవరిని సంతోషపెట్టడానికి అంబేద్కర్‌ను చులకన చేస్తున్నారు? ఆర్ఎస్ఎస్ భావజాలానికి అనుకూలంగా కనిపించే వాదనలను ఎందుకు ముందుకు తెస్తున్నారు? దీనికి సమాధానం హమారా ప్రసాద్ ప్రజల ముందు చెప్పాలి" అని పిట్టా వరప్రసాద్ డిమాండ్ చేశారు.

**"అంబేద్కర్ రచనలు ప్రపంచానికి మార్గదర్శకం.. కల్పిత కథనాలు చరిత్రకు ప్రత్యామ్నాయం కావు!"**

"అంబేద్కర్ రచనలు ఈ దేశ సామాజిక, రాజకీయ, ఆర్థిక ఆలోచనలకు అపారమైన మేధో సంపద. ఆయన నిర్మించిన రాజ్యాంగ దృక్పథం భారత ప్రజాస్వామ్యానికి పునాది. ఆయన చూపిన సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, న్యాయం అనే విలువలు ప్రపంచానికి ఆదర్శప్రాయమైన సందేశాన్ని అందిస్తున్నాయి."
"అలాంటి అంబేద్కర్‌ను సోషల్ మీడియా వ్యాఖ్యలతోనో, ఒక కల్పిత నవలతోనో చిన్నచూపు చూడాలని ప్రయత్నించడం సూర్యుడిపై రాయి విసరడం లాంటిదే. రాయి సూర్యుడిని తాకదు---విసిరిన వ్యక్తి ముఖాన్ని తిరిగి తాగుతుంది " అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు.
చివరగా డా. పిట్టా వరప్రసాద్ స్పష్టం చేస్తూ-
"అంబేద్కర్‌ను విమర్శించడానికి మేము భయపడము. కానీ అంబేద్కర్‌ను వక్రీకరించడానికి, ఆయన భావజాలాన్ని బలహీనపరచడానికి, సామాజిక న్యాయ పోరాటాన్ని అవమానించడానికి చేసే ప్రతి ప్రయత్నాన్ని ప్రజల ముందుకు తీసుకువచ్చి ప్రశ్నిస్తాం. హమారా ప్రసాద్ కల్పిత కథనాలతో చరిత్రను మార్చలేరు. అంబేద్కర్ రచనల మహత్తును తగ్గించలేరు. ప్రజల చైతన్యాన్ని వెనక్కి తిప్పలేరు."
కాదు కూడదు అని మీరు ముందుకు వెళితే ఈ భారతావనిలో అంబేద్కర్ వాదుల చేతిలో పరాభవాలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండండి

# ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలపై పూర్తి అవగాహన లేకుండా మాట్లాడటం సరికాదు

**బీజేపీకి పార్టీ కీ కౌంటర్ ప్రెస్ మీట్.**




హైదరాబాద్ ఎస్టేట్ లక్ష్మీ నారాయణ వనపర్తి జిల్లా ప్రతినిధి కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సంబరాలను చూసి జీర్ణించుకోలేక బీజేపీ నాయకులు అర్థంలేని ఆరోపణలతో ప్రెస్‌మీట్లు పెడుతున్నారని పెబ్బేరు కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శించారు. ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలపై పూర్తి అవగాహన లేకుండా మాట్లాడటం సరికాదని, వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని సూచించారు.

రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్‌తో పాటు రైతు సంక్షేమం, మహిళా సంక్షేమం, విద్య, వైద్యం తదితర రంగాల్లో పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముందుకు సాగుతోందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. పెబ్బేరు అభివృద్ధి విషయానికి వస్తే గతంతో పోలిస్తే బస్టాండ్ లో గణనీయమైన మార్పులు వచ్చాయని, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి కూడా చర్యలు ప్రారంభమయ్యాయని తెలిపారు. నూతన ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయని, ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వ చొరవతోనే జరుగుతున్నాయని పేర్కొన్నారు. పెబ్బేరు మున్సిపాలిటీ ఏర్పడి కేవలం ఎనిమిది నెలల సమయం మాత్రమే అయిందని, ఈ స్వల్ప కాలంలోనే అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని కాంగ్రెస్ నాయకులు చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

బైపాస్ సమస్యపై కేంద్రం చొరవ తీసుకోవాలి పెబ్బేరు బైపాస్ రహదారి సమస్యపై కూడా కాంగ్రెస్ నాయకులు బీజేపీపై ప్రశ్నలు సంధించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున జాతీయ రహదారి సమస్యల పరిష్కారానికి కేంద్రంతో మాట్లాడి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత బీజేపీ నాయకులపైనే ఉందన్నారు. పెబ్బేరు అభివృద్ధి కోసం ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే మెగారెడ్డి మహబూబ్‌నగర్ హైవే అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకునేందుకు కాంగ్రెస్ నాయకులు కృషి చేస్తున్నారని తెలిపారు. బీజేపీ నాయకులు విమర్శలు చేసినా, చేయకపోయినా కాంగ్రెస్ పార్టీ ప్రజల మధ్యనే ఉంటుందని నాయకులు అన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు



# మాధవాంజీ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 05:)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ మహేశ్వరం మండల కేంద్రంలోని మొహబ్బత్‌నగర్ గ్రామంలో ,మాధవాంజీ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీలో వై ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని సెప్టెంబర్ 5న కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ హరి ప్రసాద్, కోఆర్డినేటర్ అమర్‌నాథ్, వైస్ ప్రిన్సిపాల్ మనోగ్నా, ప్రొఫెసర్ డాక్టర్ రఘునాథ్ రెడ్డి అండ్ డా. పి సి హనుమంతరావు పాల్గొని ఉపాధ్యాయ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఫిజియోథెరపీ విద్యలో జ్ఞానంతో పాటు సేవాభావం, క్రమశిక్షణ, మానవతా విలువలను పెంపొందించడంలో ఉపాధ్యాయులు ముఖ్యమైన పాత్ర పోషిస్తారని తెలిపారు.

ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులకు హృదయపూర్వక ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని డైరెక్టర్ హరి ప్రసాద్, కోఆర్డినేటర్ అమర్‌నాథ్, వైస్ ప్రిన్సిపాల్ మనోగ్నా, ప్రొఫెసర్ డిఆర్ కే డా. హనుమంతరావు మరియు లెక్చరర్లను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ విద్యార్థులు తమ కృతజ్ఞతలను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో ఫిజియోథెరపీ విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# సామాజిక , ఆర్థిక, రాజకీయ అసమానతలను నిర్మూలించి సమానత్వాన్ని సాధించడమే ఎమ్మార్పీఎస్ ఆశయం.

**-సమాజ మద్దతుతో సుదీర్ఘ కాలం పాటు ఉద్యమం నడిపి విజయం సాధించాం.. ఇగ సమాజంలోని అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సు కోసం నిబద్ధతతో నిలబడదాం.**

**- ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి మహేశ్వరం నూతన మండల కమిటీ ఎన్నిక.-ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఇంచార్జి రాగళ్ల ఉపేందర్ మాదిగ.**






( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 05:)

సామాజిక ఆర్థిక రాజకీయ అసమానతలు లేని నూతన సమాజ నిర్మాణం కాంక్షిస్తూ ఎమ్మార్పీఎస్ ఉద్యమం తన ప్రయాణాన్ని కొనసాగిస్తుందని, దేశవ్యాప్తంగా పాలకులు పట్టించుకొని సమస్యలను గుర్తించి అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం ప్రజా పోరాటాలను నిర్మిస్తుందని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఇంచార్జి రాగళ్ల ఉపేందర్ మాదిగ అన్నారు.

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మరియు అనుబంధ సంఘాల మండల కమిటీ సమావేశం మండల ఇంచార్జి ఎర్ర గణేష్ మాదిగ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ " దేశంలో ఎన్నో కుల ఉద్యమాలు పుట్టినప్పటికీ లక్ష్యం సాధించే వరకు ఏ ఉద్యమం నిలబడలేకపోయాయి కాని ఎమ్మార్పీఎస్ మాత్రమే సజీవంగా నిలబడి లక్ష్యం చేరిందని దానికి మందకృష్ణ మాదిగ సమర్థవంతమైన నాయకత్వమే కారణమని అన్నారు. పాలకులు పట్టించుకోని సమస్యలను ప్రతిపక్షాలు రాజకీయ పక్షాలు గుర్తించని అంశాలను ప్రధాన ఎజెండాగా చేసుకుని పోరాటాల ద్వారా అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందించిన చరిత్ర ఎంఆర్పిఎస్ ఉద్యమాన్నిదని, అందుకే ఉద్యమాన్ని పటిష్టవంతంగా నిర్మాణం చేసుకొని బలోపేతం చేసుకోవాలని మండలంలో శక్తివంతంగా తయారు కావాలని కోరారు.

మాదిగలే కాకుండా అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం ప్రజా సమస్యలను గుర్తించి ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని అసమానతలు లేని నూతన సమాజ నిర్మాణమే లక్ష్యంగా పేదరిక నిర్మూలన కుల వివక్షత దోపిడి పీడనలేని సమాజం కోసం పోరాడుతామని మహనీయుల మార్గంలో దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామని తెలిపారు.

అనంతరం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, మాదిగ యువసేన నూతన మండల కమిటీని ఎన్నుకోవడం జరిగింది.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు :- బోల్లెపాక ప్రభాకర్ మాదిగ
అధికార ప్రతినిధి:- కొండని కుమార్ మాదిగ
ప్రధాన కార్యదర్శి:- పెండ్యాల శ్రీనివాస్ మాదిగ
ఆకన్పల్లి యాదయ్య మాదిగ, ఉపాధ్యక్షులు:- మంద మహేష్ మాదిగ
భూషన్నగారి శేఖర్ మాదిగ
పి వంశీ మాదిగ
కోశాధికారి:- శంకరయ్య మాదిగ
కార్యదర్శి :- పి మల్లేష్ మాదిగ

ఎం ఎస్ పి మండల కమిటీ.
మండల అధ్యక్షులు :- ఆదిరాల స్వామి మాదిగ
అధికార ప్రతినిధి:- పోరండ్ల నరసింహ మాదిగ
ప్రధాన కార్యదర్శి:- మంద నరసింహ మాదిగ
ఉపాధ్యక్షులు:- మహేశ్వరం రాజేష్ మాదిగ
కిన్నరి రాజు మాదిగ
కార్యదర్శి :- మోడీ శేఖర్ మాదిగ,

మాదిగ యువసేన కమిటీ
మండల అధ్యక్షులు:- ఎర్ర జగన్ మాదిగఅధికార ప్రతినిధి :- రావుగళ్ళ శ్రీధర్ మాదిగ ప్రధాన కార్యదర్శి :- పెంజర్ల భాస్కర్ మాదిగ. తదితర కమిటీలను ఎన్నుకోవడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఎంఎస్పి మాజీ జిల్లా అధ్యక్షులు రావుగల్ల బాబు మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు పెంటనోళ్ల నరసింహ మాదిగ, ఎం ఎస్ పి మాజీ మండల అధ్యక్షులు ఎర్ర కృష్ణ మాదిగ, సీనియర్ నాయకులు బక్కని రవి మాదిగ, డాక్టర్ జంగయ్య మాదిగ, అర్జున్ మాదిగ, నవీన్ మాదిగ వివిధ గ్రామాల నుండి ఎమ్మార్పీఎస్ మరియు అనుబంధ విభాగాల కార్యకర్తలు పాల్గొన్నారు

# కోళ్లపడకల్ గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ-సర్పంచ్ చేపంగి ప్రవీణ్



హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 5

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అర్హులైన పేద,మధ్యతరగతి కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులను మంజూరు చేస్తున్న నేపథ్యంలో కోళ్లపడకల్ గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ చేపంగి ప్రవీణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు,పంచాయతీ కార్యదర్శి మహేష్,ఉప సర్పంచ్ ఆవుల మల్లేష్,మహిళలు,యువకులు,గ్రామ పెద్దలు,వివిధ పార్టీల నాయకులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీలకతీతంగా అందరూ ఒక్కటై స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడం విశేషంగా నిలిచింది. అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ కార్డుల ద్వారా సంక్షేమ పథకాల ప్రయోజనాలు మరింత సులభంగా అందుతాయని కార్యక్రమంలో పాల్గొన్న వారు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన గ్రామ ప్రజలు,ప్రజాప్రతినిధులు,మహిళలు,యువత,గ్రామ పెద్దలు,వివిధ పార్టీల నాయకులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు,
కృతజ్ఞతలు

# పాము నడకను మించిన పెబ్బేర్ మున్సిపాలిటీ డ్రైనేజ్ వ్యవస్థ

**హైకోర్టు ఉత్తర్వులను సైతం లెక్కచేయని సబ్ కాంట్రాక్టర్లు**

**ఇంటి యజమానులతో కుమ్మక్కై 35 పీట్లకు కుదించిన డ్రైనేజ్ నిర్మాణ పనులు**

**లంచానికి తల వంచారంటూ మున్సిపల్ ప్రజల గుసగుసలు**

హైదరాబాద్ ఎస్టేట్ లక్ష్మీ నారాయణ వనపర్తి జిల్లా ప్రతినిధి

పెబ్బేరు నుండి వనపర్తి వెళ్లే ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా హైకోర్టు త్వరలో అమలు చేయాలని రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి మూడు సంవత్సరాలు గడుస్తున్న నేటికీ అసంపూర్తిగా ఉన్నాయని రోడ్డుకు ఇరువైపులా 40ఐ40 ఫీట్ల వెడల్పుతో లోడు డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టాలని మునిసిపాలిటీకి అధికారులు ఆదేశించారు. హైకోర్టు ఆదేశాలను సైతం లెక్కచేయకుండా కొంతమంది సబ్ కాంట్రాక్టర్లు ఇంటి యజమానులతో కుమ్మక్కై వారికి అనుగుణంగా 35 పీట్లకు కుదించి ఇస్తానుసారంగా డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతున్నారు మున్సిపాలిటీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎల్లారెడ్డి సామాజిక కార్యకర్త వల్లపు రెడ్డి శ్రీధర్ రెడ్డి, శ్రీనాథ్, వెంకట్రావు జి, నరేందర్ లు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లిన ఫలితం లేకుండా పోయింది. కోర్టు ఉత్తర్వులు అనుగుణంగా ఇరువైపులా 40 ఫీట్ల డ్రైనేజీ నిర్మించాలంటూ డిమాండ్ చేస్తున్నారు.



# రక్తదానంతో పుట్టినరోజు వేడుకలు

## - సెప్టెంబర్ 6న నియోజకవర్గవ్యాప్తంగా నాలుగు కేంద్రాల్లో శిబిరాలు

హనుమకొండ, సెప్టెంబర్ 5 హైదరాబాద్ ఎస్టేట్:

పుట్టినరోజు వేడుకలను ఆడంబరాలకు దూరంగా నిర్వహిస్తూ, ప్రాణదానానికి ప్రతీకగా నిలిచే రక్తదాన కార్యక్రమానికి హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని ఇనగాల చారిటబుల్ ట్రస్ట్, రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో సెప్టెంబర్ 6న నియోజకవర్గవ్యాప్తంగా నాలుగు చోట్ల భారీ రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హనుమకొండ సుబేదారిలోని రెడ్‌క్రాస్‌లో ఉదయం 10 గంటలకు, పరకాలలోని స్వర్ణ ఫంక్షన్ హాల్‌లో 10.30 గంటలకు, గుడెప్పాడులోని ఎన్ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో 11.30 గంటలకు, గీసుకొండలోని పద్మావతి ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 12.30 గంటలకు శిబిరాలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. అత్యవసర సమయంలో రక్తం అందక ప్రాణాలు కోల్పోయే పరిస్థితులను నివారించేందుకు రక్తదానం ఎంతో కీలకమని వెంకట్రామ్‌రెడ్డి పేర్కొన్నారు. తన పుట్టినరోజున తనకు అందించే అత్యుత్తమ కానుక రక్తదానమేనని అన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువతీ యువకులు పెద్ద సంఖ్యలో శిబిరాలకు హాజరై రక్తదానం చేసి ఈ సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

